క్లుప్తంగా

దీన దయాల్‌కు నివాళి



తిరుపతి గాంధీ రోడ్డు: దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన వ్యక్తి పండిట్ దీన్ దయాళ్ అని జిల్లా బీజేపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు గుండాల గోపీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. దీన్ దయాళ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవిత, జయంతి కుమార్, టీ.సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మందుల దుకాణాల తనిఖీ

చంద్రగిరి: మత్తు కలిగించే మందులు(నార్కోటిక్ డ్రగ్స్) విక్రయిస్తే మెడికల్స్ షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి రూరల్ డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రూత్ హెచ్చరించారు. ఆమె సోమవారం చంద్రగిరిలోని మందుల దుకాణాలలో తనిఖీలు చేపట్టారు. అర్హత కలిగిన వైద్యుల సిఫార్సు లేనిదే మందులు ఇవ్వకూడదని, కాలం చెల్లిన మందులు విక్రయించినా, నకిలీ(బిల్లులు లేని) మందులు విక్రయించినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధ్యానంతో చదువుపై ఏకాగ్రత

తిరుపతి రూరల్: ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుందని తిరుపతి పిరమిడ్ సొసైటీ కార్యదర్శి ఆచార్య ప్రతాప్ తెలిపారు. తిరుపతికి సమీపంలోని సీగొల్లపల్లి సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం నూతన విద్యార్థులకు ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధ్యానం చేయడం ద్వారా మనస్సును నిలకడగా ఉంచుకోవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, డాక్టర్ నాగరాజు, ప్రిన్సిపల్ రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీచైత్ర హాస్పిటల్ ప్రారంభం



తిరుపతి కల్చరల్: దేవేంద్ర థియేటర్ ఎదురుగా ఉన్న అశోకనగర్‌లో ఏర్పాటు చేసిన అద్వాన్సుడు కిడ్నీ అండ్ మెటర్నిటీ హాస్పిటల్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఇందులో ముఖ్య అతిథులుగా మేయర్ శిరీష, మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి పాల్గొన్నారు. హాస్పిటల్ అధినేత డాక్టర్ శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ తిరుపతి ప్రజలకు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

టీటీడీ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు శిక్షణ

తిరుపతి సిటీ : శ్వేత భవనంలో సోమవారం టీటీడీ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు ఒకరోజు శిక్షణ ఇచ్చారు. జాతీయ స్థాయి శిక్షకులు ఎం నాగరాజు మాట్లాడుతూ కొన్ని టీటీడీ కళాశాలలు త్వరలో అటానమస్ స్టేటస్‌ను పొందనున్నాయని తెలిపారు. ఇందుకోసం అనుసరించాల్సిన విధి విధానాలను అధ్యాపకులు తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. టీటీడీ విద్యాశాఖాధికారి ఎం భాస్కర్ రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, విద్యాశాఖ సలహాదారు మోహన్ కుమార్ రెడ్డి, టీటీడీ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ మహదేవమ్మ, నారాయణమ్మ, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వారపు సంతలో అన్నదానం



పాకాల : స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు సమీపంలో నిర్వహిస్తున్న వారపు సంతలో సోమవారం రైతులు, వ్యాపారులకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



పాకాల : స్థానిక ఎస్‌వీఎస్ పాఠశాల విద్యార్థులకు సోమవారం పూర్వ విద్యార్థిని ఎస్.విజయ, వారి కుటుంబ సభ్యులు విద్యా సామాగ్రిని అందజేశారు. ఆమె మాట్లాడుతూ తన తండ్రి జయరామనాయుడు, భర్త ఉమేష్, అయ్యప్ప స్వామి ఆలయ పూజారి కృష్ణదాస్ జ్ఞాపకార్థం నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేసినట్టు తెలిపారు. అలాగే మౌలిక వసతుల కోసం త్వరలో రూ.50 వేల ఇస్తామని ప్రకటించారు.

మారణాయుధంతో వ్యక్తి సంచారం

పాకాల: మారణాయుధంతో సంచరిస్తున్న వ్యక్తిని సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ ఓబులేశు తెలిపారు. ఓ వ్యక్తి నడుముకు కత్తి కట్టుకుని, మూతికి గుడ్డ చుట్టుకుని తిరుగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో గాలింపు చేపట్టినట్లు వెల్లడించారు. పాకాల బస్టాండ్ వద్ద ఆ వ్యక్తిని గుర్తించి విచారించామన్నారు. హర్యానాకు చెందిన హర్జీత్‌సింగ్‌గా తెలిపాడని, గాదంకి సమీపంలోని ఓ దాబాలో పనిచేస్తున్నట్లు వివరించాడని చెప్పారు. ఆచారం కోసమే చేతికి కడియం, నడుముకి కత్తి ఉంచుకున్నట్లు తెలిసిందని వెల్లడించారు. దీనిపై చుట్టుపక్కల వారిని సైతం విచారించి ధ్రువీకరించుకున్నట్లు సీఐ తెలిపారు.



రథోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు



కళాకారుల ప్రదర్శన

పులకించిన తిరుమల కొండ





వాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఎంపీ వేమూరి ప్రభాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఇతర అధికారులు



కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఎనిమిదవ రోజు ఉదయం స్వామి వారు ఉభయదేవేరులతో కలిసి రథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వామిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. గోవింద నామ స్మరణతో తిరుమల గిరులు పులకించాయి. రాత్రి మలయప్ప స్వామి అశ్వవాహనంపై దర్శనమిచ్చారు. వాహన సేవల సందర్భంగా కళాకారుల కళా ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భక్తులకు టీటీడీ సిబ్బంది ఆహార పదార్థాలతోపాటు తాగునీరు అందజేశారు.

- తిరుమల

ఘనంగా కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో సోమవారం కల్యాణ కామేశ్వరి మంత్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అవివాహిత యువతీ యువకులకు వివాహ గడియలు వచ్చి కల్యాణం జరగాలనే సంకల్పంతో గంగమ్మ ఆలయంలో ప్రతి నెలా వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం రోజైన శ్రావణ నక్షత్రంలో కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ మండపంలో అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి శాస్త్రోక్తంగా కల్యాణ కామేశ్వరి మంత్ర హోమం చేపట్టారు. ఉదయం 9 గంటలకు ఆరంభమైన కల్యాణ కామేశ్వరి మంత్రహోమం 11.45 గంటలకు చేపట్టిన



హోమంలో పూర్ణాహుతి చేస్తున్న ఆలయ చైర్మన్, ఈవో, అర్చకులు

పూర్ణాహుతితో ఘనంగా ముగిసింది. ఇందులో పాల్గొన్న కంకణదారులకు అమ్మవారి ప్రసాదం, కండువా, జాకెట్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుడా కార్యదర్శి లక్ష్మి, ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, ఆలయ కమిటీ సభ్యురాలు వి.క్రిష్ణమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఫార్మసిస్టుల ర్యాలీ

తిరుపతి కల్చరల్: ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా సోమవారం ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో ఘనంగా ర్యాలీ చేపట్టారు. బాలాజీ కాలనీలోని ఎస్వీ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఈ ర్యాలీని అనంతపురం జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ రంగజనార్దన్ జెండా ఊపి ప్రారంభించారు. ఆరోగ్య వ్యవస్థల పటిష్టతలో ఫార్మసిస్టులు అనే అంశంతో ఎస్వీ ఉన్నత పాఠశాల నుంచి ప్రకాశం రోడ్డు, గాంధీరోడ్డు, తీర్థకట్టవీధి, భవానీనగర్ కూడలి మీదుగా ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల వరకు ర్యాలీ సాగింది. ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.రంగనాయకులు, సహాయ కార్యదర్శి డాక్టర్ ఎం.నిరంజన్‌బాబు, కోశాధికారి ప్రొఫెసర్ నాగరాజు, కృష్ణమూర్తి, పద్మావతి స్కూల్ ఆఫ్ ఫార్మసి అధినేత్రి పి.సులోచన, డైరెక్టర్ పి.ప్రణీత, సెవెన్ హిల్స్ కళాశాల ఫార్మసీ అధినేత్రి సుమలత, పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం, ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పద్మావతి పాలిటెక్నిక్ కళాశాల, శ్రీవిద్యానికేతన్ కళాశాల ఫార్మసీ, కృష్ణతేజ ఫార్మసీ, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైనెస్స్ కళాశాలల యాజమాన్యం, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఫార్మసిస్టులు, విద్యార్థులు

తల్లిపాల ప్రయోజనాలపై శిక్షణ

తిరుపతి కల్చరల్: రుయా ఆసుపత్రి విభాగం, బీపీఎన్‌ఐ సంస్థ సంయుక్తంగా రుయాలోని గర్భిణులు, స్త్రీల విభాగంలో తల్లిపాలు బిడ్డకు ఉపయోగాలు, దాని ఆవశ్యకత సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. వారం రోజులు చేపట్టనున్న సర్టిఫికెట్ కోర్సు శిక్షణ కార్యక్రమానికి వివిధ రాష్ట్రాల నుంచి 24 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ ఈ శిక్షణలో తల్లి బిడ్డకు పాలు ఇవ్వడంలో మెళకువలు, అందులో సంరక్షణ వంటి అంశాలు తెలియజేస్తామని తెలిపారు. ఈ శిక్షణలో ఉద్యోగులందరూ సమగ్ర సమాచారంతో పాటు మెళకువలు తెలుసుకుని, గ్రామీణ ప్రాంతాల్లోని తల్లులకు తగిన విధంగా సలహాలు ఇవ్వాలని సూచించారు. అనంతరం విశ్రాంత ఆచార్యులు, సీనియర్ చిన్నపిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఆర్ముగంను ఘనంగా సత్కరించారు. రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు, గర్భిణులు, స్త్రీల ఆసుపత్రి సూరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, డాక్టర్ ప్రమీలాదేవి, చిన్న పిల్లల విభాగం డాక్టర్ మనోహర్, డాక్టర్ ఆర్ ఆర్ రెడ్డి, డాక్టర్ కిరీటి, డాక్టర్ శశికుమార్‌రెడ్డి పాల్గొన్నారు. హిందూపురానికి చెందిన కోర్స్ డైరెక్టర్ డాక్టర్ కేశవులు, పాండిచ్చేరికి చెందిన డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ మంజుబాల దాస్, ఆదోనికి చెందిన డాక్టర్ రఘునాథ్, ఎస్వీ వైద్యకళాశాల పీఆర్‌వో వీర కిరణ్ పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జనం

భాకరాపేట : వినాయక చవితి సందర్భంగా చిన్నగొట్టిగల్లు మండలంలో ఏర్పాటుచేసిన విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు రంగులు చల్లుకుంటూ, బళ్లారీ డ్రమ్ములు, మంగళవాయిద్యాల నడుమ యువకులు కేరింతలు కొడుతూ విగ్రహాలను ఊరేగించారు. చినిగేపల్లె, కురవపల్లె, చిన్నగొట్టిగల్లు, రాజువారిపల్లె, చిన్నగొట్టిగల్లు కాలనీల్లో యువత ప్రత్యేకంగా వినాయకుని ఊరేగించారు. పలుచోట్ల వినాయకుడి లడ్డూను వేలం వేశారు. భక్తులు పోటీ పడి ప్రసాదాన్ని దక్కించుకున్నారు.



కురవపల్లెలో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళుతున్న యువకులు

● రథ సారథులు

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఇద్దరు యువతులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తిరుమలలో కొన్ని కార్యక్రమాల్లో మీరాశీ వ్యవస్థ ఉంది. ఈ క్రమంలో రథోత్సవంలో రథం సారథులుగా ఐదు కుటుంబాల ప్రతినిధులు పాల్గొంటారు. ఈసారి రెడ్డెప్ప గారి, మునెప్ప గారి వంశానికి అవకాశం వచ్చింది. ఈ ఇద్దరి వంశం నుంచి ఎవరూ మగ పిల్లలు లేకపోవడంతో వారి కుమార్తెలు క్యాతి (స్విమ్స్ పద్మావతి కళాశాలలో న్యూరోసర్జన్‌గా రెండో సంవత్సరం చదువుతోంది.) మౌనీషా (చార్టెడ్ అకౌంటెంట్) తమ వంశ పరంపరను కొనసాగించారు. వారికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి రథసారథులుగా తీర్చిదిద్దారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





రథసారథులుగా క్యాతి , మౌనీషా

భవిష్యత్‌పై దృష్టి సారించాలి

తిరుపతి సిటీ: విద్యార్థులు భవిష్యత్‌పై దృష్టిసారించి లక్ష్యాన్ని చేరుకోవాలని స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి సూచించారు. కళాశాలలో 2023–24లో బీటెక్ లేటరల్ ఎంట్రీ విద్యార్థులకు సోమవారం ఓరియంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ కీలకమైందని, చెడు విషయాలకు దూరంగా ఉండి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని కోరారు.

గాయకుడు ఎస్పీ బాలుకు నివాళి

తిరుపతి కల్చరల్: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం వర్థంతిని సోమవారం రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాకారులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కార్యదర్శి కేఎన్.రాజా, కళాకారులు కె.కేశవులురెడ్డి, సుబ్రమణ్యం, పొన్నాల జేజిరెడ్డి, కవిత, విజయకుమార్ పాల్గొన్నారు.

29న చంద్రగిరిలో 'జగనన్నకు చెబుదాం'

చంద్రగిరి: వివిధ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని చంద్రగిరిలో ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. ఇందులో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పాల్గొంటారని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు



మహతిలో వేణు వాయిద్య కచేరి నిర్వహిస్తున్న బి.విద్యాసాగర్ బృందం

తిరుపతి కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో సోమవారం మహతి కళాక్షేత్రంలో హెచ్‌డీపీపీ కళాకారుడు బి.విద్యాసాగర్ వేణు గానం శ్రవణానందకంగా సాగింది. అన్నమాచార్య కళామందిరంలో దాససాహిత్య ప్రాజెక్టు కళాకారులు జనని హంసిని బృందం గాత్ర కచేరి వీనులవిందు చేసింది. రామచంద్ర పుష్కరిణి వేదికపై పి.రమణవాణి బృందం భక్తి సంకీర్తనలను గానం చేసి సభికులను ఆకట్టుకున్నారు.

రేపు ప్రపంచ పర్యాటక దినోత్సవం

తిరుపతి కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు తిరుపతి నగరంలోని రామానుజ సర్కిల్ నుంచి శిల్పారామం వరకు 2కే రన్, సాయంత్రం 6.30 గంటలకు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. వివిధ రంగాల్లో సేవలు అందించిన వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేస్తామన్నారు.

సేవాభావం అలవర్చుకోవాలి

తిరుపతి సిటీ: విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ భారతి తెలిపారు. వర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ అన్ని యూనిట్ల ఆధ్వర్యంలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు. కోఆర్డినేటర్ విద్యావతి, గంగాభవాని, సుజాత, అనిత, వజీహ భాను, తులసి, మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లులో..

భాకరాపేట : విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగరాణి తెలిపారు. కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు ప్రారంభంలో ఆమె మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి



ఏఎంసీ చైర్మన్, పాలకవర్గంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల : పాకాల మార్కెట్ యార్డు అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన సమక్షంలో సోమవారం ఏఎంసీ చైర్మన్‌గా లింగయ్య, వైస్ చైర్మన్‌గా జి.అల్తాఫ్, డైరెక్టర్లుగా రుకేష్‌రెడ్డి, శివశంకర్, భరత్‌కుమార్, సునీత, మహ్మద్, రాజారాంనాయుడు, స్వర్ణ, శాంతి, గురుదేవ్, దివ్య, శాంత, సులోచన, లత, ఎక్స్ అఫియో సభ్యులుగా పాకాల సింగిల్ విండో చైర్మన్ ఎన్.మునీశ్వర్‌రెడ్డి, ఇరంగారిపల్లి సర్పంచ్ వసంత ప్రమాణ స్వీకారం చేశారు. వారితో మార్కెట్ యార్డు కార్యదర్శి తులసీరామ్ ప్రమాణ స్వీకారం చేయించారు. లింగయ్య మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఏఎంసీ చైర్మన్ పదవి అప్పగించిన చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి రుణపడి ఉంటానని, రాబోవు ఎన్నికల్లో మోహిత్‌రెడ్డి విజయానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్ యార్డు అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామన్నారు. అభివృద్ధి పనుల ప్రణాళికను త్వరగా సిద్ధం చేసి పంపాలని, నిధులు విడుదల చేస్తామన్నారు. రైతుల సంక్షేమానికి పాలకవర్గం పనిచేయాలని సూచించారు. అనంతరం చైర్మన్, కార్యవర్గ సభ్యులను సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే ఎన్ఆర్.జయదేవ్‌నాయుడు, ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, నాయకులు రఘుపతి, మహాసముద్రం పట్టాభిరెడ్డి,, కపిలేశ్వర్‌రెడ్డి, రహీం, హరిప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ కస్తూరి, గౌరీశంకర్‌రాజు, ఎంపీటీసీలు మణినాయుడు, శ్యామల, రాజేంద్ర, భాస్కర్‌నాయుడు, గుండ్లూరి సురేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వద్దు

తిరుపతి తుడా : ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత హెచ్చరించారు. ఆమె సోమవారం అధికారులతో కలిసి డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలు చేపట్టారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఎన్జీవో కాలనీ లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన టీ దుకాణాలన్నింటిని తొలగించాలని ఆదేశించారు. కొత్తపల్లి ప్రాంతంలో కాలువలు, రోడ్లు, తెలుగుగంగ లైన్ ఏర్పాటు చేయాలని, తిలక్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్ ఎత్తు పెంచాలని, గాంధీపురం, న్యూ ఇందిరానగర్ ప్రాంతాల్లో తెలుగుగంగ నీటిలో మురుగు నీరు కలుస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ హరిత

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం అండ

చంద్రగిరి: ప్రత్యేక అవసరాల పిల్లల మానసిక స్థితి మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని ఎంఈవో లలిత కుమారి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం చంద్రగిరి, తిరుపతి రూరల్, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళ్యం మండలాలకు చెందిన దివ్యాంగులకు ఉపకరణాల కోసం వైద్య నిర్ధారణ పరీక్షల ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వినికిడి లోపం, రొలేటర్స్, ట్రైసైకిల్ తదితరాలను ఉచితంగా అందజేస్తామన్నారు. అనంతరం నిర్వహించిన వైద్య నిర్ధారణ పరీక్షల్లో 35 మందికి టీఎల్ఎం, 18 మందికి వినికిడి యంత్రాలు, 9 మందికి వీల్ చైర్‌లు, ఇద్దరికి లోలేటర్స్, ఒక్కరికి ట్రైసైకిల్, ఒక్కరికి క్యాలీఫర్ అవసరమని గుర్తించారు. ఐఈ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఐఈడీ ఎస్ఎస్ ఉదయ్ కుమార్, ఫిజియోథెరపిస్టు సరళ కుమారి, ఐఈఆర్టీలు వెంకట రాజేశ్వరి, శ్యామల దేవి, సుమ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వైద్య పరీక్షలు చేస్తున్న అధికారులు

పోలింగ్ కేంద్రాల తుది జాబితాకు ఆమోదం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో పోలింగ్ కేంద్రాలపై గుర్తింపు పొందిన జాతీయ రాజకీయ పార్టీల అభిప్రాయాలను సేకరించి తిరుపతి నియోజకవర్గం పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఆమోదించి జిల్లా ఎన్నికల అధికారి ద్వారా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపించినట్టు తిరుపతి ఓటరు నమోదు అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఆమె సోమవారం రాజకీయ పార్టీల ప్రతినిధుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1500 మంది ఓటర్లు దాటిన కేంద్రాలను విభజించాలనే నిర్ణయం మేరకు 2 కేంద్రాలను విభజించి మరో రెండు కేంద్రాల ఏర్పాటుకు అంగీకారం తెలిపామన్నారు. తిరుపతి నగరంలోని 265 పోలింగ్ కేంద్రాల్లోని 19 పోలింగ్ కేంద్ర స్థలాలు, 8 పోలింగ్ కేంద్రాల పేర్లు మార్చినట్టు చెప్పారు.



రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న హరిత

గజవాహనంపై పద్మావతి అమ్మవారి చిద్విలాసం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు సోమవారం సాయంత్రం గజవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తరాషాడ సందర్భంగా సోమవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీకృష్ణ ముఖ మండపంలో కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు గజవాహనంపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శేషగిరి, సుభాస్కర్ నాయుడు పాల్గొన్నారు.



గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న శ్రీవారి పట్టపురాణి

శ్రీవారి ఆలయ సిబ్బందికి వస్త్ర బహుమానం

తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సేవలందిస్తున్న శ్రీవారి ఆలయ అర్చకులు, వేదపారాయణదారులు, వాహనం బేరర్లు, మేళం సిబ్బందికి సోమవారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వస్త్ర బహుమానం అందజేశారు. తిరుమల వైభవోత్సవ మండపంలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి చేతులమీదుగా వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దంపతులు ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో సిబ్బందికి వస్త్ర బహుమానం అందిస్తున్నట్టు చెప్పారు.

నేడు వైల్డ్‌లైఫ్ సైంటిస్ట్ కమిటీ పరిశీలన

తిరుమల: అలిపిరి, శ్రీవారిమెట్టు నడకమార్గంలో ఇనుపకంచె ఏర్పాటుకు సంబంధించి వైల్డ్ లైఫ్ సైంటిస్ట్ ఆధ్వర్యంలోని కమిటీ సభ్యులు మంగళవారం పరిశీలించనున్నారు. భక్తులపై చిరుత దాడి చేసిన నేపథ్యంలో రెండు నడకదారుల్లో ఇనుపకంచె ఏర్పాటుకు వైల్డ్ లైఫ్ అనుమతులను టీటీడీ కోరింది. దీనిపై స్పందించిన కేంద్ర వైల్డ్ లైఫ్ సంస్థ డెహ్రాడూన్‌కు చెందిన వైల్డ్‌లైఫ్ సైంటిస్ట్ రమేష్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు కమిటీ సభ్యులు రెండు నడకదారుల్లో పరిశీలన చేయనున్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలో ఇంటర్ విద్యార్థిని భవ్యశ్రీ మృతి కారకులైన నిందితులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీసీ సంఘర్షణ సమితి గౌరవ అధ్యక్షుడు బుసగాని లక్ష్మయ్య, అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్ డిమాండ్ చేశారు. వారు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 17న భవ్యశ్రీ కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. పోలీసులు వెంటనే స్పందించి ఉంటే నిండు ప్రాణం పోయేది కాదన్నారు. పోలీసులు అగ్రవర్ణాలకు వత్తాసు పలుకుతూ మీనమేషాలు లెక్కిస్తూ కేసును నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నట్టు అనుమానం కలుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఎస్పీ, డీఎస్పీ స్పందించి భవ్యశ్రీ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి 48 గంటల్లోపు నిందితులకు శిక్ష విధించాలని కోరారు. లేని పక్షంలో బీసీలంతా ఛలో పెనుమూరు పోలీస్ స్టేషన్ కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. టి.రమణ, విజయకుమార్, శ్రీరాములు, జయరామయ్య,కుప్పం శేఖర్, తిరుమల, నరేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు తురక అమరనాథ్